క్లుప్తంగా

ఇంటింటికీ మొక్కలు నాటాలి



ప్రగతినగర్‌లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు

భువనగిరిటౌన్ : ప్రతి ఇంట్లో ఐదు మొక్కలు నాటాలని భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భువనగిరి పట్టణం ప్రగతినగర్‌లో వనమహోత్సవంలో భాగంగా ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కైరంకొండ కొండ వెంకటేష్ పాల్గొన్నారు.

స్వర్ణగిరి శ్రీ వారికి వసంత సేవ



భువనగిరిలోని శ్రీవారికి వసంత సేవ నిర్వహిస్తున్న పండితులు

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం శ్రీవారికి వసంత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చ కార్యక్రమాన్ని పండితులు వేద మంత్రాల మధ్య నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో సుమారు 4వేల భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి : పట్టణంలోని ఎస్సీ వెల్ఫేర్ బాలురు జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 300 మంది విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యారు. ఇందులో అర్హులైన 150 మంది విద్యార్థులకు ప్రవేశ అవకాశం కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నారీశక్తి పురస్కారం ప్రదానం



అవార్డు అందుకుంటున్న పద్మ సంతోష్

మోటకొండూర్ : మండలంలోని ముత్తిరెడ్డిగూడెంకు చెందిన నూనెముంతల పద్మసంతోష్ నారీశక్తి పురస్కారం అందుకున్నారు. కొన్నేళ్లుగా ఆమె చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గాను హైదరాబాద్‌లోని హబ్సిగూడలో శ్రీ ప్రగతి ఫౌండేషన్, వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డు ప్రదానం చేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీ

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు క్విజ్‌పోటీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ బి.సంజీవ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రో గ్రాం ఆఫీసర్లు వి.నర్సింహారావు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గిరిజన గురుకుల విద్యాలయంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం పౌష్టికాహారంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్, నాపికిన్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళ సాధికారత మిషన్ జిల్లా కోఆర్డినేటర్ హర్ష, భార్గవి, నిఖిత, మనిషా, కవిత, విద్యాలయం ప్రత్యేకధికారి శివరంజని ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామన్నపేట : మండలంలోని సిరిపురం గ్రామంలో ఇటీవల మృతిచెందిన మిర్యాల రామకృష్ణ కుటుంబానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు గంగుల వెంకటరాజిరెడ్డి శనివారం పదివేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు జినుకల ప్రభాకర్, పున్న జగన్మోహన్, గుత్తా నర్సింహారెడ్డి, ఎండీ అక్రం ఉన్నారు.

మహిళల మూత్రశాలలో దుండగుడు

భువనగిరి: భువనగిరి బస్టాండ్‌లోని మహిళల మూత్రశాల గది పైకి ఎక్కిన దుండగుడికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లోని మహిళల మూత్రశాల గది పైకి శనివారం రాత్రి ఓ దుండగుడు ఎక్కి లోనికి తొంగిచూడటం మొదలుపెట్టాడు. ఓ మహిళా కండక్టర్ గుర్తించి స్థానికులకు విషయం తెలియజేయడంతో వారు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

ఓ వైపు కంకర.. మరో వైపు బురద

- అధ్వానంగా మోత్కూరు–ఖప్రాయపల్లి రోడ్డు
- 3.6 కి.మీ రోడ్డు నిర్మాణానికి రూ.5.80కోట్లు మంజూరు
- నిధుల లేమితో పనులు మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా ఉన్న మోత్కూరు–ఖప్రాయపల్లి రోడ్డు

మోత్కూరు : ఓ వైపు కంకర.. మరో వైపు బురద గుంటలు ఇదీ.. మోత్కూరు–ఖప్రాయపల్లి రోడ్డు దుస్థితి. దశాబ్దా కాలంగా ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాయగిరి–మోత్కూరు ప్రధాన రహదారికి ఆత్మకూరు(ఎం) మండలం ఖప్రాయపల్లి నుంచి మోత్కూరు పట్టణం వరకు 6నెలల క్రితం చేపట్టిన రోడ్డు విస్తరణ పునర్నిర్మాణ పనులు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. 2021–22లో ఖప్రాయపల్లి నుంచి మోత్కూరు వరకు 3.6 కి.మీ.రోడ్డును విస్తరించేందుకు ప్రభుత్వం రూ.5.80 కోట్లు మంజూరు చేసింది. రోడ్డు విస్తరణ పనులకు గత జనవరిలో మోత్కూరులో ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నెల రోజుల పాటు పనులు చురుగ్గానే చేశాడు. రాజన్నగూడెం వద్ద కిలో మీటరున్నర దూరం రోడ్డు వెడల్పు చేసి ఒక వైపు కంకర పరిచారు. మరో వైపు అలానే వదిలేశాడు.

నిధులు సరిపోవని సవరణ ప్రతిపాదనలు

ఖప్రాయపల్లి–మోత్కూరు రహదారికి తొలుత మంజూరు చేసిన నిధులు సరిపోవని అధికారులు మొదట్లోనే సవరణ ప్రతిపాదనలు (రివైజ్డ్ ఎస్టిమేషన్) రూ.7.90 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఆ నిధులు మంజూరు కావాల్సి ఉంది.

ప్రయాణం నరకప్రాయం

ఖప్రాయపల్లి నుంచి మోత్కూరు వరకు 3.6 కి.మీ.రోడ్డులో ఓ వైపు కంకర, మరో వైపు ఎర్రమట్టి పోసి వదిలేసారు. వర్షాలకు రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. మోత్కూరు నుంచి రాజన్నగూడెం కల్వర్టు వద్ద పెద్ద పెద్ద మడుగులు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

రోడ్డు పనులు చేపట్టాలి



ఖప్రాయపల్లి–మోత్కూరు ఆగిపోయిన రోడ్డు విస్తరణ నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలి. అస్తవ్యస్తంగా, అసంపూర్తి రోడ్డుతో అవస్థలు పడుతున్నాం. ఉన్నతాధికారులు వెంటనే ఆగిన రోడ్డు నిర్మాణం పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రభుత్వం స్పందించకుంటే రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్తులం ఆందోళన చేపడతాం.
– కొంగరి మల్లయ్య, రాజన్నగూడెం

వర్షాలు తగ్గగానే పనులు చేపడతాం

వర్షాలు తగ్గగానే రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం. కాంట్రాక్టర్ అర్ధంతరంగా రోడ్డు పనులు నిలిపివేసింది వాస్తవమే. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్‌కు నోటీస్ ఇవ్వడంతో రెండు, మూడు రోజుల్లో పనులు చేపడతామని చెప్పారు. రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– షెహనాజ్, డీఈ, ఆర్అండ్‌బీ

కవితానర్సింహాచారి సేవలు అభినందనీయం



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న శ్యాంసుందర్‌రావు

భువనగిరి : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ జనగాం కవితా నర్సింహాచారి దంపతులు చేస్తున్న సేవలు అభినందనీయమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. శనివారం స్థానిక ప్రగతినగర్‌లో కౌన్సిలర్ జనగాం కవితానర్సింహాచారి కుమార్తె భావన జ్ఞాపకార్థం రూ. 6 లక్షలతో ఏర్పాటు చేసిన వైకుంఠ రథం వాహనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయ దశరథ, నాయకులు నర్ల నర్సింగ్‌రావు, చందా మహేందర్‌గుప్తా, నీలం రమేష్, సుర్వి లావణ్య,రాచకొండ కిష్టయ్య పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ శ్రీనివాస్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అత్యధిక కేసులు కలిగిన ప్రాంతాన్ని విడిచి తక్కువ కేసులు ఉన్నచోట కోర్టును ఏర్పాటు చేయడం సరికాదన్నారు. అన్ని రకాల పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, మున్సిపల్, మండల అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, దాసోజు భిక్షమాచారి, ఊడుగు వెంకటేశం, కైరంకొండ అశోక్, కట్ట కృష్ణ, లగ్గోని పాండు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో నెమలి మృతి

ఆలేరురూరల్ : అనుమానాస్పద స్థితిలో నెమలి మృతిచెందింది. ఈ ఘటన ఆలేరులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక రైల్వేప్లాట్ ఫామ్‌పై మధ్యాహ్నం నెమలి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంబంధిత అధికారులు లేటుగా స్పందించి సాయంత్రం వచ్చి సంచిలో వేసుకొని నెమలిని తీసుకెళ్లారని స్థానికులు ఆరోపించారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న కమిటీ ప్రతినిధులు

భువనగిరి : విద్యా రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని తెలంగాణ విద్యా పరిక్ష కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వినాయచౌరస్తా వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. తక్షణమే విద్యా రంగానికి కేటాయింపులు పెంచాలని, పాఠశాలలో సర్వీస్ పర్సన్ నియమించాలని, పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు మైలారం.సత్తయ్య, యం.వెంకట్‌రెడ్డి, లక్ష్మీనరసింహారెడ్డి, బి.లింగయ్య, సత్తయ్య, శ్రీనీనివాసాచారి, బాలనర్సయ్య, శేఖర్, జంగారెడ్డి, ఎం.నాగేందర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

చేనేత పథకాలపై ప్రభుత్వం ప్రకటన చేయాలి

మోత్కూరు : రాష్ట్రంలో చేనేత కార్మికులకు అమలవుతున్న చేనేతకు చేయూత, చేనేత మిత్ర తదితర పథకాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మోత్కూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేనేతకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టత ఇవ్వ లేదని విమర్శించారు. ప్రభుత్వం చేనేతకు ప్రత్యేక బడ్జెట్ ప్రకటించి చేనేత పరిశ్రమను పరి రక్షించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు చింతకింది సోమరాజ్, లక్ష్మి, లక్ష్మమ్మ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని 10వార్డుకు చెందిన చెక్క నరేశ్ ఇటీవల మృతిచెందాడు. దాంతో శనివారం పోచంపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన రూ.2006–07 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మృతుడి కుటుంబానికి రూ. 20,510ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

గీతకార్మికుడి కుటుంబానికి..

పట్టణ కేంద్రానికి చెందిన కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం మాజీ డైరెక్టర్ కట్కూరి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గునగంటి మల్లేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు తండ వెంకటేశం, మక్తాల పోచయ్య, చెరుకు అంజయ్య, బండి యాదగిరి, కొయ్యడ నర్సింహ పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతికి ఘన నివాళి



భువనగిరిలో ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న మహమూద్

భువనగిరి : బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు మహమూద్ ఆధ్వర్యంలో శనివారం ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వినాయక చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాస్త్రసాంకేతిక రంగంలో అబ్దుల్ కలాం యువతకు ఆదర్శంగా ఉన్నరన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, నాయకులు రత్నపురం శ్రీశైలం, రమేష్, కోటి పాల్గొన్నారు.

ఆలేరురూరల్ : ఆలేరు పట్టణ కేంద్రంలోని రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నేతాజి సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పుట్ట మల్లేషం, వడ్డెమాన్ నరేందర్, కుర్షిద్‌పాషా, పంతం కృష్ణ, సముద్రాల శ్రీనివాస్, సందీప్, సాగర్, ఫయాజ్, అశోక్, సిద్దులు, ఉపేందర్, జితేందర్, నజీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ లైన్‌మన్‌పై దాడి

చౌటుప్పల్ : విద్యుత్ లైన్‌మన్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ లైన్‌మన్ జెల్లపల్లి శ్రీనివాస్ శనివారం పట్టణ కేంద్రంలోని ఫేమస్ బేకరీ వద్ద ఉండగా తాళ్లసింగారం గ్రామానికి చెందిన ఊదరి నర్సింహతోపాటు మరికొంత మంది కలిసి దాడికి పాల్పడ్డారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బైక్ అపహరణపై కేసు నమోదు

చౌటుప్పల్ : ద్విచక్రవాహనం ఎత్తుకెళ్లిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. పట్టణ కేంద్రంలోని ట్రినిటీ స్కూల్ వెనుక ఏరియాలో ఉండే తాళ్లపల్లి మహిపాల్‌కు చెందిన గ్లామర్ వాహనం తన ఇంటి పార్క్ చేసి ఉండగా ఈనెల 13న గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

రాష్ట్రంలో కుంటుపడిన అభివృద్ధి

యాదగిరిగుట్ట: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కుంటుపడిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్ విమర్శించారు. యాదగిరిగుట్టలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, జెల్లా భానుచందర్, ఉపాధ్యాక్షులు బందారపు బిక్షపతి, బోడ రాధ, బుచ్చిబాబు తదితరులున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

బొమ్మలరామారం : ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు బకాయి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడ్యా రాజు అన్నారు.మండల కేంద్రంలో శనివారం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జగన్‌నాయక్. వెంకటేష్, భరత్, శ్రీకాంత్, వేణు. చరణ్. అవినాష్, శివ, సందీప్.శ్రీధర్. సునీల్, మున్నా పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ఆలేరురూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య కోరారు. ఆలేరు మండలం కొలనుపాకలో ఓ ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షుడు పూజారి కుమారస్వామి ఆధ్వర్యంలో మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులకు భృతి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాస్, భోగ శ్రీనివాస్, లక్ష్మి, అర్చన, మధు, రాజు, రవి, అమర్, సందీప్, కిషన్, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ప్రధానం



భువనగిరి : కేంద్రియ విద్యాలయంలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

భువనగిరి : పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ప్రధానమని కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. పట్టణంలోని కేంద్రియ విద్యాలయంలో శనివారం శిక్షాసప్తహ–24 కార్యక్రమంలో భాగంగా ఏక్ పెడ్ మాకా కే నామ్ వృక్షరోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పెంచాలన్నారు. భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు.

గుండాల : పాఠశాలలోని ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులచే మొక్కలు నాటించి సంరక్షించాలని అంబాల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎలుగు లింగయ్య కోరారు. శనివారం శిక్షా సప్తహల్ మిషన్ లైఫ్ స్కూల్ న్యూట్రీషన్ డే ఏకో క్లబ్స్‌లో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం మొక్కలు నాటించారు. పర్యావరణ పరి రక్షణకు మొక్కలే కీలకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదులు, ఉపాధ్యాయులు రాఘవేందర్, అంగన్‌వాడి టీచర్ భాగ్యలక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి మొక్కలు నాటాలి

రాజాపేట : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లులు మొక్కలు నాటారు ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దుడుకు జానయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్, లెనిన్, శ్రీదేవి, అనిత, కరుణ, పెట్రీషియ, హేమలత, నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మోటకొండూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తహలో భాగంగా, ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ పాండు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో వలంటీర్ల కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కేతిరెడ్డి, రఘురాం రెడ్డి, చొల్లేటి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణపై అవగాహన ర్యాలీ



మోటకొండూర్ : విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎస్ఐ పాండు

వలిగొండ : ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు సహజవనరుల రక్షణతోపాటు పర్యావరణ పరిరక్షణపై ప్లకార్డులు ధరించి శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ థామస్ అబ్రహం ఉపాధ్యాయులు జరిన్, పీటర్, రమేష్, జనార్దన్, శాంద్రా తేజస్వీ పాల్గొన్నారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

ఆలేరురూరల్ : ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ గేటు వద్ద అఖిలపక్ష నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈఅసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష కన్వీనర్ పసుపునూరి వీరేషం, ఆర్.జనార్దన్, ఎం.చంద్రశేఖర్, చెక్క వెంకటేష్, కెమిడి ఉప్పలయ్య, ఇక్కిరి సహదేవ్, సుదర్శన్, తుంగ కుమార్, రవి, అశోక్, ఎండి సలీం, బాంబే రవి, నంద గణేష్, జూకంటి శంకర్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

భువనగిరి : రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం రాత్రి పట్టణంలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్‌హాల్ ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డిస్ట్రిక్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ హనీఫ్ మెమన్, కార్యదర్శి సుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో తిరునగరి రంగయ్య, సద్ది వెంకట్‌రెడ్డి, శెట్టి బాలయ్య యాదవ్, బుచ్చిరెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

వలిగొండ : ట్రిబుల్ఆర్, గౌరెల్లి –కొత్తగూడెం రోడ్డు నిర్మాణాలకు భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం అందజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక రైతు వేదికలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పోరుబాటలో భాగంగా రైతుల సమస్యలను పరిష్కరించాలని అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మాటూరి బాలరాజు, మద్దెల రాజయ్య, సిర్పంగి స్వామి, మెర్గు వెంకటేశం, శ్రీశైలంరెడ్డి, రాంచంద్రం పాల్గొన్నారు.

న్యాయం చేస్తాం : ఆర్డీఓ

వలిగొండ : ట్రిబుల్ఆర్, గౌరెల్లిరోడ్డు నిర్మాణంలో భూమి కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక రైతువేదికలో మల్లేపెల్లి రైతుల అభిప్రాయాలు తీసున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

ఆత్మకూరు (ఎం) : అసంపూర్తిగా ఉన్న బునాదిగాని కాలువ, నవాబ్‌పేట రిజర్వాయర్‌లను పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వట్టిపల్లి శ్రీనివాస్ కోరారు. శనివారం స్థానికంగా జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాగులపై వంతెనలు, బీటీ రోడ్లు నిర్మించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్, అబ్బయ్య, ఇంద్రారెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, కుమార స్వామి, రాంరెడ్డి, చంద్రారెడ్డి, సోమయ్య పాల్గొన్నారు.

● బోనమెత్తిన విద్యార్థినులు





పోతరాజుల వేషధారణ.. శివసత్తుల విన్యాసాలు..సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు బోనాలతో ప్రదర్శన అలరించింది. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం ఆషాఢమాస బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. వేలాది మంది విద్యార్థినులతో కలిసి బోనాలతో పట్టణ పురవీధుల మీదుగా నిర్వహించిన ప్రదర్శన స్థానికులను ఆకట్టుకుంది. – చౌటుప్పల్